# ఆటోగ్రాఫ్

—జలంధర

"ఏమన్నారమ్మా డాక్టర్...?" కార్లో కూర్చోగానే మెల్లగా అడిగాడు తండ్రి.

"మూడో నెల..." తలకాయ వంచి చెప్పింది హారతి.

ఏదో అడగబోయి మానేశాడు తండ్రి.


వృత్తిరీత్యా ఆయన జడ్జి. కానీ, కొన్ని సమస్యలకు అంత త్వరగా జడ్జిమెంటు ఇవ్వలేని తండ్రి.

ఇట్లాంటి స్థితిలో న్యాయానికి తల్లి తోడుగా రావాలసింది.కానీ... ఆవిడకు కోపం కూతురు మీద ... కాపరం చెడగొట్టుకుంటోందని... "అన్నం పెట్టడా? రోడ్డుమీదకు తరిమేశాడా? ప్రతిదానికీ అతి..." కూతురు "ఆత్మగౌరవం" గురించి మాట్లాడినప్పుడల్లా ఈ మాటలు అని నోరు మూయించాలని ప్రయత్నిస్తోంది గత వారం రోజులుగా...

బేసిక్ నీడ్స్... అన్నం, అండ... ఇవి రెండేనా పెళ్ళి వెనకాల కారణాలు?!

దాదాపు సంవత్సరం క్రితం జరిగిపోయిన "పెళ్ళి" గుర్తుకు వస్తోందామెకు.

అర్థం, గమ్యం లేనట్టు పరిగెడుతున్న కార్లను చూస్తూ ఆలోచనలలో పడింది హారతి.



అత్తగారి కుటుంబానికి సంప్రదాయబద్ధమైన మంచి కుటుంబమన్న పేరుంది. ఆ మాట వెనకాల ఎన్ని హృదయ విచ్ఛేదాలు, ఎన్ని కన్నీళ్ళు, ఎన్ని నరమేధాలు జరుగుతాయో అనుభవిస్తే కానీ తెలియదు.

"కుర్రాడు ఇంజనీరు, బుద్ధిమంతుడు....కట్నం ఇచ్చుకునే స్తోమత మాకుంది..." ఈ బాపతు మాటలు చాలా నలిగాయి.

జాతకాలు కుదరడం అవుటాఫ్ ఫాషన్ నియో రిచ్ క్లాసుకు... పోనీ బ్లడ్ గ్రూప్‌లు కలవడం, టెంపర్‌మెంట్స్ అర్థమవడం, ఐ.క్యూ.లు మాచ్ అవడం చూస్తారా అంటే, "ఆఁఅన్నీ ఎలా రాసిపెట్టుంటే.." అని సరిపెట్టుకుంటారు. మెట్ట వేదాంతం మాట్లాడేస్తారు. జీవితాలను, సంఘాన్ని శాసించే అత్యంత ముఖ్యమైన "వివాహ వ్యవస్థ" కేవలం డబ్బు అనే ఇసుకపునాది మీద నిలబడడం, ఆ తరువాత ఎప్పటికప్పుడు ఆ పునాది జారిపోకుండా కన్నీళ్ళతో తడిపి నిలబెట్టాలనుకోవడం ఆడదానికి తప్పనిసరి.

ప్రతి సంబంధమూ సాధారణంగా అటువారికీ, ఇటువీరికీ కూడా కళ్యాణ వేదికకు తరలివచ్చే దాకా, చాలా గొప్పగా కనబడుతుంది. తాము ఆశపడ్డామనో, కక్కుర్తిపడ్డామనో, తొందరపడ్డామనో ఆలోచన, 'సబ్ కాన్షియస్'లోకి తొంగి చూసినప్పుడల్లా పరస్పరం మరింత పొగుడుకుంటారు.

ఇది లోకం రివాజు. ఇదే నిజం కాకపోతే, పెళ్ళైన మూడో రోజు నుంచే "వాళ్ళకు కక్కుర్తి, కల్చరు లేదు..." అంటూ ఒకర్నొకరు విమర్శించుకునే పీడతే రాదు.

ఇవన్నీ హారతి పెళ్ళిలోనూ జరిగాయి.

ఈ మాటలన్నీ ఆమె కూడా నమ్మింది. కారణం.. మరొక రకంగా ఆలోచించాలని అనిపించకపోవడం.

కానీ పెళ్ళైన పదిహేను రోజులలో ఆమె రంగుల

కలల్లో ఒకొక్కరంగు బైటపడడం ప్రారంభించాయి--

కళ్ళు చెదిరిపోయేలా –

ఆమె భర్త రాజాలో నిద్రాణమైన మృగం దాక్కుని వుంది. ఎదుటి వారిని హింసించి, కన్నీరు తెప్పించగలిగిన మహాశక్తి వున్నది.

దానికి సెంటిమెంట్సును కాలరాసే నేర్పువున్నది.

"కాల్చుకు తినడం" అంటే ఏమిటో

గారాబంగా పెరిగిన హారతికి అప్పుడు అనుభవంలోకి వచ్చింది.

"ఆడవాళ్ళ వంక కన్నెత్తి చూడడు మావాడు!" అత్తగారు చంద్రహారాలు సవరించుకుంటూ మిగతా పేరంటాళ్ళకు చెపుతోంది సత్యనారాయణ వ్రతం రోజున... కానీ, అతని నోట ఆడవాళ్ళ ఎనాటమీ, బ్లూ ఫిలింస్, గర్ల్ ఫ్రెండ్స్... ఒకటేమిటి చాలా చాలా విన్నది. ముందు బాధగా, తరువాత ఆశ్చర్యంగా గమనించడం ప్రారంభించింది.

అత్తగారు తమ కుటుంబ గౌరవం గురించి, కొడుకుకు తల్లీ తండ్రి అంటే వుండే భయ భక్తుల గురించీ మాట్లాడేస్తోంది. ఆ మాటల్లో ఎంతఓటితనం?!

వడ్డిస్తున్న తల్లిని ఓరగా చూసింది హారతి. కూతురు మెళ్ళోరవ్వల అడ్డిగ తిరగబడుతుందేమోనని, దాన్ని గురించి ఎవరైనా అడిగితే చాలు చెప్పాలనే తహ తహ పడిపోతోంది తల్లి. వియ్యపురాలి అబద్ధాలు పట్టించుకోదు ఆ సమయంలో!

సిగ్నల్ పడింది... కారు స్లో చేస్తూ అడుగుతున్నాడు తండ్రి.

"ఏమ్మా? ఏం నిర్ణయించుకున్నావు?"

ఉలిక్కి పడి వర్తమానంలోకి వచ్చింది హారతి.

ఏం సమాధానం చెపుతుంది?

పెళ్ళయిన సంవత్సరంలోనే అతన్ని భరించలేని స్థితికి వచ్చింది ఆమె... ఆ విషయం తల్లికీ, తండ్రికీ చెబితే, తల్లి వినిపించుకోనట్టు నటిస్తోంది.

"సర్దుకుపోవాలి... అన్ని సంసారాలూ అలాగే వచ్చాయి..." అని తేల్చిపారేసింది... తండ్రి మాట్లాడకుండా అవే మాటలను అవునంటున్నాడు.

ఇప్పటి ప్రశ్న-"ఈ బిడ్డ కావాలా? అక్కర్లేదా?" అన్నది.

## సిమెంట్

"మీ కంపెనీ సిమెంట్ వాడి కట్టిన నా ఇల్లు మొన్న వానలకి కూలి పోయిందండీ బాబూ!!!"

"వాన కురిసే చోట మా సిమెంట్‌తో కట్టమని మేము చెప్పలేదే!!!"

—షేక్ కరీముల్లా (బాపట్ల)

కావాలనుకుంటే పెళ్ళి అనే ఆ భరించరాని గూడులో పూర్తిగా చిక్కడిపోతుంది. వద్దనుకుంటే..., విడిపోయి తన బ్రతుకు తను బ్రతకగలదు... కానీ...

హారతి సైకాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేట్. 'చదువు వేరు, జీవితం వేరు!' అనుకుంటూ బ్రతికేసిన హారతి తన జీవితానికి తన చదువు ఎంత ఉపయోగిస్తుందా అని ఇప్పుడు ఆలోచించడం ప్రారంభించింది.

మంచిగా వుంటూనే, అవసరం వచ్చినప్పుడు పచ్చి స్వార్థంతో బైటపడే అత్తగారూ, పెద్దరికం అనే పైశాలువ కప్పుకుని కంటి కొసలతో ఆడవాళ్ళను ఆపాదమస్తకం పరీక్షించే మామగారూ, తన మీద ప్రేమ వున్నా, తన చుట్టూ వున్న పరిస్థితుల వల్ల నిజాలు ఒప్పుకోలేని తండ్రీ, తనను భర్త హింసించినప్పుడల్లా, ఏడ్చి ఏడ్చి దిండులో తల దాచుకుని నిద్రలోకి జారినప్పుడల్లా, ఎవరో తెలియని అందమైన వ్యక్తి వచ్చి, తనను సున్నితంగా ఆప్యాయంగా లేవనెత్తి గుండెలకు హత్తుకుని ఓదారుస్తున్నట్టు ప్రతి రాత్రీ కలలు కనే తనూ..తమ అందరిలోనూ అబ్‌నార్మాలిటీ చాలా వుందని అర్థమైంది హారతికి. కానీ, అది వున్న నిష్పత్తిని బట్టీ, ఆ ఆలోచనల వైబ్రేషన్‌లో వుండే బలవత్తరమైన అనుభూతి ప్రభావాన్నిబట్టి పరిస్థితులు ఏర్పడతాయి అని కూడా అర్థమైంది.

"ప్రపంచంలో "పిచ్చివాళ్ళు" అని ముద్రపడ్డ వాళ్ళ శాతం నిజానికి చాలా తక్కువ. బైటకు సభ్యత ముసుగు వేసుకున్నా లోలోపల మానసిక రుగ్మతలు అతి భయంకర స్థితిలో పెంచుకుని మామూలు మనుష్యుల కింద చలామణీ అయ్యే వారి వల్లే సంఘం దెబ్బతింటుంది. రాజకీయవేత్తలను, చాలా మంది కళాకారులను పరీక్షిస్తే ఎన్ని రకాల మెంటల్ పర్వర్షన్స్ మనను పరిపాలిస్తున్నాయో అర్థమౌతుంది..." అంటాడు ఒక గొప్ప మనస్తత్వవేత్త. అది ఎంత నిజం ఆలోచిస్తే!

"నాన్నా! నన్ను మా ప్రొఫెసర్ గారింటికి తీసుకు వెళ్ళవూ?" అడిగింది ఒక రోజు.

ఆయన తండ్రికీ పరిచయమే... చాలా గొప్ప సైకాలజిస్ట్... దేశవ్యాప్తమైన పేరు ప్రఖ్యాతులు కలవాడు గుప్త. ఎన్నిసార్లు విదేశాలకు వెళ్ళే అవకాశం వచ్చినా "డాలర్ల కన్నా జీవితాలు ముఖ్యం... నా చదువు డ్యుయల్ పర్సనాలిటీలతో బ్రతుకుతున్న నా దేశ ప్రజలకు కావాలి..." అని ఇండియాలోనే వుండి పోయాడాయన.

"మీకు మాత్రం గుర్తింపు వుందా సార్?" అని హారతి లాంటి వాళ్ళు ప్రశ్నించినప్పుడు


"గుర్తింపు నాకూ ముఖ్యమే. కానీ, అది మనుష్యుల దగ్గర నుంచి డబ్బు రూపంలోనో, పొగడ్తల రూపంలోనో రావడం కన్నా, మారిపోయే వాళ్ళ ప్రవర్తన ద్వారా వస్తే సొసైటీని ఒక మెంటల్ పేషెంటు బారి నుంచి రక్షించాను అనుకునే వ్యక్తిని నేను..." అనేవాడు.


"మన దేశంలో ఈ సైకలాజికల్ స్టడీ ఎంతవరకు ఉపయోగిస్తుంది? ఎవరైనా వాళ్ళ దగ్గరకు వస్తేనే 'పిచ్చి' అని ముద్రపడుతుందేమోనని భయపెడతారే?" నిరాశగా అనేది హారతి.

"కరెక్టే... కానీ, కొంతవరకు మనం విదేశాల వారి కన్నా అదృష్టవంతులం. అక్కడ శరీరానికి వచ్చిన వ్యాధి పేషెంటుకు తెలుస్తుంది. కానీ మానసిక వ్యాధికి మరొకరు జడ్జిమెంటు చేసి, పేరు పెట్టి ట్రీట్‌మెంటు ఇస్తారు. ఈ వ్యాపారం ఇంకా ఇక్కడ విరివిగా లేదు. ఇది మన అదృష్టం! పైగా ఎక్కడో పాశ్చాత్యులు రాసిన పుస్తకాలతో, వాళ్ళ బేసిక్ నాలెడ్జితో మన వాళ్ళను ట్రీట్ చెయ్యకూడదు. ఇండియన్ సెంటిమెంట్స్, ఇక్కడి హ్యూమన్ కాన్సెప్ట్స్ స్టడీ చెయ్యాలి..." ఇలా చెప్పే ప్రొఫెసర్ గుప్త అంటే చాలా గౌరవం హారతికి. అందుకే ఆయనతో మాట్లాడితే తన సమస్యకు పరిష్కారం దొరకచ్చు అనుకుంది.

"ఎలాగైనా ప్రొఫెసర్‌గారు నన్ను గైడ్ చెయ్యాలి. తప్పదు..." మనస్సు ప్రార్థిస్తోంది.

కాని, వారి ఇంటికి తాళం... ఏదో వెకేషన్‌కు వెళ్ళారట. నిరాశగా తిరిగివచ్చింది హారతి.






## పోస్టరు ముందు...

విచ్చేన తీసేసి
జిగురు గిన్నె చేత్తో పట్టుకుని
నిక్కరెగదోసుకుంటూ వెళ్ళిపోతాడా కుర్రాడు

నా కాళ్ళు మాత్రం
అక్కడే అంటుకుపోయి నన్ను కదలనియ్యవు
పైన గోడకంటుకున్న పోస్టర్లలో
అర్ధనగ్న చిత్రాలు అర్ధాంతరంగా వొదిలిపెట్టవు...
ఆ దృశ్యాలు
రెప్పల్ని కోసుకుని మరీ చూడాలనిపిస్తాయి
చూపుడు వేలితో కళ్ళు నులుముకుంటూ చూస్తున్నప్పుడు
టిక్కుటిక్కుమంటూ సెకనుముల్లు హెచ్చరిస్తుంది

అక్కణ్ణించి ఆఫీసు కుర్చీలో పడ్డా
ఫైళ్ళనిండా అక్షరాలన్నీ నగ్నంగా పడివుంటాయి.
ఎంత ప్రయత్నించినా నేల
కాళ్ళను ఆకర్షించదు.
నరాల మధ్య ఆనకట్ట కూలిపోతుంది
—క్యాంటీన్లో కాఫీ తాగుతున్నపుడు
ఎన్నడూ లేంది చొక్కామీదంతా ఒలికిపోతుంది

ఆఫీసు బిలం నుంచి బయటపడి
రోడ్డు మధ్య పిచ్చివాడిలా
అదే పోస్టర్ను చూస్తూ నడుస్తున్న నన్ను
సైకిలువాలా గుద్దేసి, చీవాట్లేసి మరీ వెళ్తాడు.



చీరుకుపోయిన దెబ్బలకు కాపడం పెట్టుకుని
నిద్రలో బస చేసినపుడు
స్వప్నం తొడగొట్టి
సవాలు చేస్తుంది
నన్ను నిజం చేసుకుంటావాని?
ఆ ఒక్క పోస్టర్‌వల్లే
ఈ బాధలన్నీ. —మణిగోపాల్

ఏం చెయ్యాలో తెలియని స్థితి... పాత పుస్తకాలు అన్నీ సర్దిపెడుతోంది.

అప్పుడు జారిపడింది ఆ చిన్న పుస్తకం.

ఆటోగ్రాఫ్ పుస్తకం... కాలేజీ వదిలిపెట్టేటప్పుడు అందమైన స్నేహాలు, చక్కటి పరిచయాలు శాశ్వతం అనుకుని వాళ్ళ గుర్తుగా తీసుకునే ఆటోగ్రాఫ్... ఒక్కొక్క పేజీ తిప్పుతోంది హారతి. తియ్యటి స్నేహాలు, సరదాగా వుండే కొటేషన్స్! ఎంత తియ్యగా అనిపించేది భవిష్యత్తు అప్పుడు?!

కన్నీళ్ళు తుడుచుకుంటూ ఒక చోట ఆగిపోయింది హారతి. ప్రొఫెసర్ గుప్త ఆటోగ్రాఫ్.

రెండు పేజీలు నిండుగా రాసిన అక్షరాలు మెరుస్తున్నాయి. ఆయనకు తన మీద వాత్సల్యం ఆ అక్షరాల్లో కనిపిస్తోంది.

**Woman and life... both are bundle of contradictions**. నువ్వుదీపంగా స్థిరంగా నిలబడి వెలగాలనుకుంటున్నావో, హారతిగా ఐక్యమై, అంతమై పోదలుచుకున్నావో ఆలోచించుకో... రెండు మార్గాలూ అర్థం వున్నవే. జీవితంలో ఒక తలుపు మూసుకుంటే, మరొక కిటికీ తెరుచుకుంటుంది. గమ్యానికి ఎప్పుడూ వెయ్యి మార్గాలుంటాయి. "మన మార్గం మాత్రమే సరైనది" అన్న "ఎగో" మనకు లిమిటేషన్ ఏర్పరుస్తుంది. ఇది చాలా బాధలకు కారణం.

నేను ఋషిని కాను...'దుఃఖానికి కారణం 'కోరిక', దాన్ని చంపెయ్!'అనడానికి.

మనిషిని ... అందుకే కారణం ఎనలైజ్ చెయ్యి అంటున్నాను. సమస్య ఎప్పుడూ పరిస్థితులతో కాదు... మనుష్యులతోనే. 'హ్యూమన్ నేచర్' మీద అథారిటీ అయిన సుసాన్ లాన్గర్

**The traditional Psychoanalytic theory of human growth postu lates that regressive goals are Primary"**

అంటారు.

మౌలికంగా ప్రతి మనిషిలో పసితనం, అమాయకత్వం వుంటుంది. అవకాశం వస్తే ప్రతి మనిషీ వెనక్కు తిరిగి ఆ స్థితికి మళ్ళీ రావాలనే ప్రయత్నం తనకు తెలియకుండానే చేస్తాడు. ఆ అవకాశం ఇచ్చిన సైకాలజిస్ట్ స్నేహితుడు, గురువు, గైడ్ అవుతాడు.

ఆశీస్సులతో
గుప్త

### దొరికింది

"ముక్కు పుడక రాయి చాలా బాగుంది - ఎక్కడ కొన్నావాదినా???"
"కిలో రెండు రూపాయిలు పెట్టి కొన్న బియ్యంలో దొరికింది!!!

—షేక్ కరీముల్లా (బాపట్ల)

ఆమె చెయ్యి వణుకుతోంది. అందులో ప్రతి అక్షరం ఆమెలో కొత్త రేజాన్ని నింపుతోంది.

ఒక నిర్ణయానికి వచ్చింది హారతి.

"అమ్మా! మా అత్తగారింటికి వెళ్ళి వస్తా..." తండ్రి ముఖంలో వెలుతురు.

చలిమిడి ఒళ్ళో పెడుతూ "అనవసరంగా ఎవరితో పోట్లాడకు..." హితం చెబుతోంది తల్లి.

నవ్వొచ్చింది హారతికి... వీళ్ళ మధ్యే పెరిగినా వీళ్ళకి తను ఎంత తక్కువ అర్థమైంది??

వెళ్ళిననాటి నుంచీ స్టడీ చేయడం ప్రారంభించింది హారతి. భర్త మూర్ఖత్వం, మొండితనం, అమానుషత్వానికి బాధపడడం తప్పకపోయినా అర్థాలు వెతుకుతోంది... అతని చిన్నప్పటి స్నేహితులు, ఫోటోలు, పరిచయాలు, పెరిగిన పాత ఇల్లు, అతను చదివిన పుస్తకాలు – వాటన్నింటిని గురించిన అతని అభిప్రాయాలూ మాటల్లో పెట్టిమెల్లగా సేకరించడం ప్రారంభించింది.

'అన్నీ నాకు కావాలి'అనే అతనికి దేనితోనూ సరైన బాంధవ్యం లేదు. తనకు నచ్చిన సీతాకోక చిలకను పట్టు కొచ్చి, తమ్ముడు లాక్కుంటాడేమోనని గుప్పెట్లో పెట్టి మూసేసేవాడు. అది చచ్చిపోవచ్చు. కానీ, మరొకరిది కాకూడదు...

"అది మీ వేళ్ల మధ్య గింగిం కొట్టుకుంటూంటే... మీకేమీ అనిపించేది కాదా?" పరీక్షగా అడిగింది హారతి.

"నాకా... ఓ... ఆ గిలిగింత చాలా థ్రిల్లింగ్..."

నిట్టూర్చిందామె.

పన్నెండుకాన్పులు అయిన అత్తగారూ, మామగారూ చాలా రోజులు రెండు గదుల ఇంట్లో కాపుర ముండేవారు. ఇవతలి గదిలో ఎదుగుతున్న పిల్లలకు అవతలి గదిలో "సంసారం" అన్న పేరుతో జరిగేది తెలియని విషయం కాదు. రాజా నోటి గుండా ఎన్నో సార్లు తన తండ్రి శాడిజం, తల్లి పడ్డ హింస, ఆయన అంటే నటిస్తున్న భయం వెనకాల అంతర్గతంగా దాక్కున్న అసహ్యం, హత్య చెయ్యాలన్న కచ్చ ఎన్నోసార్లు విన్నది. కానీ, తండ్రి కనబడగానే లేచి నిలబడేవాడు. తన చేత అతి మర్యాదలు చేయించేవాడు.

కొడుకులో వున్న రాక్షసుడు అత్తగారికి బాగా తెలుసు. కాకరకాయ చక్కెర పాకంలో వేసి తీపి పిండివంట తయారుచేసి 'కొత్తరకం' అని చెప్పుకునే అహంకారం నిజాన్ని ఇలా దాచాలని ప్రయత్నిస్తోందని అర్థమైంది ఆమెకు.

నైచ్యమూ, వంచన-ఈ రెండింటికీ అర్థం తెలుస్తోంది హారతికి. అక్షరం అక్షరం అనుభవంలోకి వస్తోంది. చాలా దుఃఖాలకు-తమలో లేనిదాన్ని ఆపాదించుకుని నటిస్తే చాలు, అలవరించుకోనక్కర్లేదన్న గుణం కారణం-అని అర్థమైంది హారతికి.

మధ్యలో తను ఎలా వుందో చూడడానికి వచ్చారు తల్లి, తండ్రీ.

కూతురు సర్దుకుపోతే బాగుండును అనుకుంటూ టానిక్‌లు, మందులూ అంటూ హడావిడి చేసే తండ్రి నటనా, రాబోయే సీమంతానికి కావలసినంత హడావిడి ప్లాన్ చేస్తున్న తల్లీ... తను మాత్రం... కడుపులో పెరిగే ఈ పసి ప్రాణిపైన స్వీట్ ఫీలింగ్స్, బుల్లినోరు, రోజా రేకుల్లాంటి చేతులు, బూరె బుగ్గలు... తన కడుపులోని ఫీటస్ రూపు దిద్దుకుని, రేకులు విప్పుకుంటోందని అన్న ఆలోచనే ఏదో పులకింత కలిగిస్తున్నా, కచ్చకొద్దీ తల్లీ దండ్రీ ఎదురుగా అబార్షన్ గురించి మాట్లాడేది.

కానీ 'ఎందుకని అలా?' అని ఇప్పుడు ఆలోచిస్తోంది హారతి. 'మనందరం మనం చుట్టూ కట్టుకుంటున్న అబద్ధాల సాలెగూడు నుంచి ఒక్కసారి బైటపడదామా?!' అని అందర్నీ అడగాలనిపిస్తోంది.

భర్తని పరాయి వ్యక్తిగా, ఒక సైకలాజికల్ పేషెంటుగా ఆలోచిస్తే అతని మీద జాలివేస్తోంది. జాలిపడి జీవితాన్ని మరింత నరకం చేసుకోవడానికి ఆమెలో వ్యక్తిత్వం ఒప్పుకోవడం లేదు. తను తన స్థిరత్వాన్ని పోగొట్టుకున్నట్టు అనిపించినప్పుడల్లా ప్రొఫెసర్ గుప్త ఆటోగ్రాఫ్ చదివేది.

అక్షరాల వెనకాల ఒక నిశ్శబ్దత వుంటుంది. కానీ, ఆ నిశ్శబ్దత్వానికి వుండే సంచలిత స్వరం మనలోని 'ఆశబ్దత' మాత్రమే గుర్తించగలదు.

కేవలం పొడి మాటలు, తడి కళ్ళు - ఈ స్థితులన్నీ దాటితే కానీ అర్థంకాని అవగాహన అది:

అవి ఎప్పుడో రాసిన మాటలే...

కానీ, ఇప్పుడవి కావలసివచ్చాయి.

కొన్ని అంతేనేమో... అవసరం వచ్చినప్పుడు కానీ, స్వస్వరూపంతో సాక్షాత్కరించవేమో!

ఆ ఆటోగ్రాఫ్‌లో ప్రతి మాటా సన్నటి వెలుగు దారంతో ఏదో చీకటి కొండ మీద నుంచి కాంతి తోరణాలు కట్టి దారి చూపిస్తున్నట్టుంది ఆమెకు.

"మనిషి స్థితి జన్మరీత్యా పవిత్రమైందే. కర్మ రీత్యా రకరకాల రూపులు దిద్దుకుంటుంది. అవకాశమిస్తే మనిషిలోని అంతర్గత జీవన వాహిని మొదటి ఆ స్థితికే వెళ్ళాలనే అనుకుంటుంది."

ప్రొఫెసర్‌గారు ఈ విషయాలన్నీ సైకాలజీ పాఠశాలలో కలిపి చెపుతున్నప్పుడు మహా ఛాందసంగా కనబడేవి. "మీలో వుండే నిస్వార్థమైన ప్రేమ, దయ, మెంటల్ పేషెంటుకూ, మీకూ మధ్య కాటలిస్ట్‌గా పని చేస్తాయి!" అని చెపితే "అదెలా! మరీ ఈయన మాట్లాడతారు!" అనుకునే వారు స్టూడెంట్స్.

తల్లి, తండ్రి స్వార్థపూరిత ప్రేమవల్ల తన భర్త వ్యక్తిగా దారి తప్పాడు...దారి తప్పిన స్నేహితుల వల్ల పద్ధతులు మార్చుకున్నాడు. కానీ వాళ్ళందరూ చాలా, తెలివిగా "మంచివాళ్ళు"గా మిగిలిపోయారు...బ్యాలెన్స్ తప్పి, ఇతను ఇలా తయారైనాడు. సుసాన్ లాఖ్‌గర్ రాసిన 'హ్యూమన్ నేచర్' స్టడీ చేసింది. మనిషి వెనక్కు తిరిగి "స్వాభావిక ప్రశాంతత" స్థితికి వెళ్ళేపరిస్థితులు ఏమిటో అర్థం చేసుకోవడం ప్రారంభించింది.

రాజాతో ఆమె ప్రవర్తనలో చాలా దగ్గరతనం వుంది. కానీ వెంటనే దూరంగా నిలబడి పరిస్థితిని సమీక్షించుకునే సైకాలజిస్ట్ వున్నది.

రాజాలో బండతనం... ఏదో కరుగుతున్నట్టు అనిపించేది. "మన పాపకు ఏం పేరు పెడదాం?" ఒక రోజు అడిగాడు.

ఆశ్చర్యంగా చూసింది ముందు హారతి. ఆడదానిగా ఆనందపడింది. వెంటనే తేరుకుని "అబార్షన్ చేయించు కుందామనుకుంటున్నాను" సూటిగా చూస్తూ చెప్పింది.

"ఎందుకని?" తీక్షణంగా అడిగాడు... అరిచాడు. గోల చేశాడు... ఆరాటపడ్డాడు. తల్లితండ్రుల చేత నీతులు చెప్పించాడు. సంప్రదాయం గురించి మాట్లాడాడు. బాధపడుతున్నా లొంగటం లేదు హారతి.

"నువ్వు తల్లివా? రాక్షసివా? నా బిడ్డను చంపడానికి నీకెన్ని గట్స్?" అర్థరాత్రి లేచి జుట్టు పట్టుకుని లేపుతూ అడిగాడు.

మెల్లగా విడిపించుకుంటూ ఆలోచిస్తోంది హారతి... ఇది నిజంగా బిడ్డ మీద ప్రేమా? "నా" అన్న పొసెసివ్‌నెస్ నుంచి వచ్చినదా? అని.

మరొక రాత్రి, "ప్లీజ్... మన బిడ్డను ఏం చెయ్యకు... నాకు ఎవరి మీదా నమ్మకం లేదు... అందరూ స్వార్థపరులే. ఈ బిడ్డను నాకు మిగుల్చు...నా కెన్నో కలలు... నాకు లేనివి, నా చిన్నప్పుడు నాకు దొరకనివన్నీ నా బిడ్డకు ఇవ్వాలి... ప్లీజ్"

తాగి, పాదాల మీద పడి ఏడుస్తున్న అతణ్ణి లేపి ఒళ్ళో పడుకోబెట్టుకుని నిద్రపుచ్చింది హారతి.

ఫీలింగ్ ఆఫ్ ఇన్‌సెక్యూరిటీ...ఎంత బుకాయించి బతుకుతున్నా వంద మందిలో కూడా ఏదో ఒంటరితనం, పెద్ద అల ఏదో వచ్చి శూన్యంలోకి తోసేస్తున్నట్టుండే భయం, ఎటూ పాలుపోనితనం.

"నీకు నేనంటే ఎంత అసహ్యమో తెలుసు నాకు. నువ్వూ నన్ను విడిచి ఎప్పుడో వెళ్ళిపోతావు. నా పాప... నా పాపను వుంచు. ప్లీజ్..."

అతని పలవరింతలు వింటూ ఆలోచిస్తోంది... ఏదీ సబ్ కాన్షియస్‌కు తెలియకుండా వుండదు. దాని నోరు నొక్కి బతుకుతాము అంతే...ఎంతసేపూ "పాప!". ఎందుకని?! అతను పొందలేని నిజమైన తల్లితనం, బాల్యం రెండూ కలిపిన ప్రాణి కావాలన్న ఆరాటమా?!

మరొకనాడు, ఇంటినిండా అందమైన పాపాయిల కాలెండర్లు, బొమ్మలు, బుల్లి బుల్లి గౌన్లు

"అన్నీ ఆడపిల్లవే తెచ్చారేం... అబ్బాయి వద్దా?" పరీక్షగా చూస్తూ అడిగింది.

"ఒద్దు."

"ఎందుకని?"

"వాడు నాలా తయారౌతాడు కాబట్టి..." సూటిగా ఆమె వంక చూస్తూ సమాధానం చెప్పాడు రాజా.

"మీకేం?"

ఒక రకంగా చూస్తూ ఆ గదిలోనించి వెళ్ళిపోయాడు అతను. 'అంతర్మథనం ప్రారంభమైంది' ఆలోచిస్తూ అనుకుంది హారతి.

ఆ రోజు తండ్రికి ఉత్తరం రాసింది.

*నాన్నా!*

నేను ఒక నిర్ణయానికి వచ్చాను.

అతనితో కలిసి వున్నా, విడిపోయినా బిడ్డ నాకు సమస్య కాదు. ఎలా పెంచాలో తెలిసిన తల్లిని నేను.

"రాజా"ను మార్చాలని ప్రయత్నిస్తున్నాను. నాకు "మంచి" భర్త కావాలని కాదు.. వ్యక్తిగా అతనిలో నిద్రిస్తున్న రూపు అతను తెలుసుకోవాలి. ఒక సైకాలజిస్ట్‌గా ప్రొఫెసర్ గుప్తాగారి శిష్యురాలిగా ఈ ప్రక్రియలో నాకు చాలా ఆనందం వున్నది.

ఇప్పుడు నాకు ఏదీ సమస్య కాదు...సహనంగా వుంటే చాలు! సహనానికి కారణం మీరనుకునే "పాతివ్రత్యం" కాదు. జీవిత గమ్యానికి వెయ్యి దారులు న్నాయినీ, మరొక వ్యక్తి దారిలో ముళ్ళు ఏరేసినప్పుడల్లా, నా గుండెల్లో ఏదో కొత్త వాకిలి తెరుచుకుంటుందన్న "జ్ఞానం" నాకు ఏర్పడింది. అంతే!

ఈ ఉత్తరం మా ప్రొఫెసర్ గారికి చూపించండి. ఆయన ఆశీర్వచనమైన "ఆటోగ్రాఫ్" ఇప్పుడే నాకు అర్థమైందని, అదిచ్చిన ఆత్మబలమే నన్ను నడిపిస్తోందని చెప్పండి.

ఉంటాను.

మీ

హారతి

### పావలా

"కోడిని అమ్ముతారా రేటెంత?"

"ఇరవై రూపాయిల పావలా!"

"పావలా ఏమిటి?"

"ఇది ఇందాక పావలా బిళ్ళ మింగిం దయ్యా బాబూ!"

— షేక్ కరీముల్లా (బాపట్ల)